

# అస్థి పంజరం

తుమ్మల కృష్ణకుమార్

నిట్టమధ్యాహ్నం సూర్యుడు ఇదంతా తన రాజ్యం అన్నట్లు ఆకాశం మధ్య ప్రతాపాన్ని చూపెడుతున్నాడు చుట్టూరా నిప్పులు చెరుగుతున్నట్లుంది ఎండ అప్పుడే భోంచేసిన నాకు కొంచెం ఆయాసంగా వుంది ఒకటే ఉక్క పంకా కొందామంటే సరిపోయినంత డబ్బు లేదు పక్కమీద అటూ ఇటూ దొర్లడం తప్ప నిద్ర పట్టదు కళ్లు మూసుకుంటే ఏమేమిటో ఆలోచనలు


రోజూ అలవాటయినా, సర్కసు వాడు తాడుమీద గడకర్ర అడ్డంగా పట్టుకొని అవతలకంతా నడిచి సురక్షితంగా వచ్చినందుకు సంతృప్తిపడతాడు

కాళ్ళకింద భూమి తగలక ఊపిరిసలపక ప్రవాహ వేగంలో మునిగి కొట్టుకు

పోయేవాడికి అకస్మాత్తుగా చెట్టుకొమ్మ దొరికి వొడ్డున పడితే బ్రతికిపోయానని ఆనందిస్తాడు

పరీక్షల్లో పిల్లలు కాపీలు కొట్టకుండా కాపలాకాసి,చివర కన్ని పరీక్షలూ అయిపోయిం తర్వాత శరీరంలో అన్ని భాగాలు క్షేమంగా వున్నందుకు సంతోషిస్తాడు బడిపంతులు

ఈ పోలికకు నాకే నవ్వు ఎచ్చింది అయినా అది వాస్తవం విద్యార్థులకి పరీక్ష లొక గడ్డు సమస్య కాలేజీకి రోజూ రాకుండా, శ్రమపడకుండా పరీక్షలు ప్యాసవాలి మరి శ్రమపడదామన్నా అనేకమయిన అభ్యంతరాలు ఇంటిదగ్గర సమయానికి సరిపోను డబ్బు దొరకదు కాలేజీలో చెప్పింది సరిగా అర్థంగాదు. పైపెచ్చు యన్ సి సి, సోషల్ సర్వీస్ లీగ్, రెడ్ క్రాస్ సొసైటీలు, డ్రామాలు, డిబేట్లు, సమ్మెలు, సవాలక్ష ఎక్స్ట్రా కరిక్యులర్ ఏక్టివిటీస్ ఆపైన నవనాగరిక సంఘం సమకూర్చిన కాలక్షేపాలు. వీటన్నిటికీతోడు యూనివర్శిటివాళ్ళ సిలబసులతోనూ, స్కీములతోనూ, పరీక్ష పద్ధతులతోనూ నానాపరిశోధనలు,



మార్పులు, చేర్పులు, ఇన్ని గండాలు గడిచి పరీక్షలు ప్యాసయితే చివరకు ఉద్యోగాలకి మంత్రుల దగ్గరనుండి సిఫా ర్సులు. అసలీ బాధలన్నీ పడలేక పరీక్ష ప్యాసవడానికి దొడ్డిదారులు. దాంతో సూపర్వైజర్లకీ, ఎగ్జామినర్లకీ ఎన్నెన్నో ఇక్కట్లు.

ఈ వేళ ఉదయంతోనే పరీక్షలు అయి పోయినయి. అంతా ఆరోగ్యంగా వున్నందుకు సంతోషంగానే వుంది కాని, ఎక్కడో ఏదో అసంతృప్తి. లోపల ఏదో గింజుకుంటున్నది. సమాధాన పరచుకోలేక పోతున్నాను. ఈ పది రోజుల్లో చాలా విశేషాలు జరిగినయి. కాని ఈ వేళ...!

ఎనిమిది గంటలకే పరీక్షలు కనుక ఉదయాన్నే బయలుదేరాను కాలేజీకి. లెక్చరరుగా ఉద్యోగం మొదలెట్టిం తర్వాత అలా ఎన్నిసార్లు వెళ్ళానో! త్రోవలో ప్రతిచోటూ చిరపరిచితం. డాబా గార్డెన్సు పార్కు. అలా కొంచెం పైకి వెళ్ళితే కుడిచేతివైపున సరస్వతీ సినీమా హాలు. ఊటీ హోటలు. ఆపైన ఎడమచేతివైపుకు తిరిగితే రెహిన్ అండ్ కంపెనీ, చైనా చెప్పుల కొట్టు, లక్ష్మి జనరల్ స్టోర్సు. పేరుమాసిన కారు గారేజి. కొంచెం ముందుకు కుడివైపున ఫైర్ సర్వీస్ స్టేషను. అలా కుడిచేతి వైపుకు తిరిగితే పోలీసు గ్రౌండ్సు, స్ప్రింగురోడ్డు మొదలు. ఎడంచేతివైపున డి.యస్.పి. ఆఫీసు. దానిముందే రోడ్డు ప్రక్కన తొడలవరకూ చీర పైకిలాగి గోచీపెట్టి, దోసిలపట్టి 'ధర్మం' అంటూ కూర్చుని వుంటుందొక నడివయసు గుడ్డిది. మరో పదిగజాలు. ఎడంవైపున కోనేరు. కోనేరులోపల చేపల పెంపకం. ఒడ్డున ముందుగా కనపడేది, గడ్డంమాసి, దుమ్ముకొట్టుకొని జాతకం బాగులేని జాత కాలు చూచే పండిత...ఏదో. 'లకోట ప్రశ్న కొకచేరూక! వాడి ముందు ఎప్పుడో ఒకసారిగాని దగాపడిన తమ్ము డెవరో చేయిచాపి కనపడడు.

ఆతరువాత రోడ్డుకటూ ఇటూ కుష్టు రోగుల కుటుంబాలు కాపురాలు. కారే చీము నెత్తురుమీద ఈగలు, దోమలు వాలకుండా పట్టీలు వేసుకొనే వాళ్ళ బాధ. వ్రేళ్ళులేని మొండి చేతితో పసిపిల్లకు పాలివ్వాలన్న తల్లి తాపత్రయం, చుట్టూరా దొరికిన కాగితాలు, చెత్తను (ఈ విశాఖపట్టణంలో ఎక్కడ జూచినా కావలసినంత) ముట్టించి, అందులో చిలకడదుంపలు తంపటివేసి ఆకలిమంట చల్లార్చుకోవాలన్న తీవ్ర వాంఛ. కాలే దుంపను తిరగవెయ్యటానికి సగం చెయ్యి పనికిరాక, ఒకప్రక్క మాడి, రెండో ప్రక్క వేడయినా తగలని దుంపని తింటో, అసహ్యంతో అసహాయతతో దేముడినీ, ప్రభుత్వాన్నీ, ప్రజలనీ బండ బూతులు తిట్టే కడుపుమంట. చెదపట్టి ఊడిపోతున్నట్లున్న శరీరాన్ని చాపి,

చూపి, 'సహాయం, సహాయం' అనే దీన రోదన – అలాంటి భూతల నరకం కనిపిస్తుంది అదిదాటి కొంచెం వంకర తిరిగితే కుడిచేతివైపున భారతీ ఫొటో స్టూడియో, కిళ్ళీబడ్డీ ఎడంవైపున యర్రయ్య అండ్ సన్స్, స్ట్రక్చరల్ ఇంజనీర్స్ ఎడాపెడా గుత్త వ్యాపారి గోదాములు ఎడంవైపుగా మూసివేసిన ప్రభాత్ టాకీస్ తర్వాత మెయిన్ రోడ్డు అదీ నిత్యం నా కగుపించే మాలోకం.

ఈ చూచిన చిత్రాల్నే పరిశీలిస్తూ ఈవేళ ఉదయం వెళ్తున్నాను. ఫైర్ స్టేషను దగ్గరకు వచ్చేసరికల్లా ఎవరో కుర్రాడు పళ్ళెం పుచ్చుకొని 'ధర్మం బాబూ' అంటూ వెంటపడ్డాడు పళ్ళెంలో ఒక రూపాయివరకూ చిల్లర పైసలు కనపడుతున్నయి ఈ పల్లెగాని పట్టణంలో ఇదొక దైనందిన వ్యాపారం. ఏదో చందాలంటూ వస్తూవుంటారు ఎవరో ఒకరు ఎప్పుడూ ప్రజల్ని దోచి ఎంతమంది వ్యక్తులు ఇలా పారాజైటుల్లా బ్రతుకుతారో తెలీదు అదీగాక ఇది శ్రీరామనవమి ఎద్దడి ప్రతి గొంది లోనూ, సందులోనూ, రోడ్డు కూడలి లోనూ ఒక పందిరి దేవుడి పెళ్ళికి ఇన్ని చోట్ల వీళ్ళంతా పెద్దలు ఆ అసహాయ దేవుడి వివాహానికి చందాలు ఇక రాత్రింబగళ్ళు వీళ్ళుచేసే గొడవకు, లౌడ్‌స్పీకర్ల రొదకు అంతువుండదు. వీళ్ళనిచూస్తే అందుకనే నా కసహ్యం ఇక్కడ నేర్చుకున్న గుణపాఠాల్లో మొట్టమొదటిది వీళ్ళకెవరికీ దమ్మిడీ ధర్మం చెయ్యకూడదని. ఆ ఖచ్చితమైన అభిప్రాయంతోనే ఆ కుర్రాడిని కసిరి కొట్టాను మొఖం చిన్నది చేసుకొని వెళ్లా డతను మరో ఇరవై గజాలు వెళ్లాను మరొక కుర్రాడు ఆపైన మరొక నలుగు రయిదుగురు పళ్లాలతో అందరినీ కసిరి కొడుతున్నాను మానవత్వంమీద అప నమ్మకంతో కోనేరువద్ద కెళ్ళేసరికి కొంచెం పెద్దకుర్రా డొకడు ఎదురు తిరిగాడు.

"ధర్మం చెయ్యమంటే అంత కోపం దేనికండి ?"

"రోజూ ఇదొక నాటకం. పోవోయ్ అవతలికి "

"అదేమిటి సార్ చదువుకున్నవాళ్లు అంత విసుక్కుంటారు," మొండిగా అన్నాడు. నాకు కొంచెం కోపంవచ్చింది

"నా చదువు గురించి నీ సర్టిఫికేట్లు అక్కరలేదు తప్పుకో అడ్డం......మీ అందరినీ పోషించడానికి సంపా దించడంలా నేను "

"మమ్మల్ని పోషించనక్కరలే దండీ ఆ రోడ్డుప్రక్కన చూడండి ఆ శవాన్ని దహనం చెయ్యడానికి..."

"ఏమిటీ ?!"

"అవునండీ పాపం మాపేటలోనే వుండేవాడు తనతోవను తను పోతూ నలుగురికి చెయ్యగలిగిం దంటూ ఏమ

యినా వుంటే చేసిపెట్టుండే వాడండీ. రాత్రి చచ్చిపోయాడు నయాపైస లేని బీదవాడు. ఆఖరికి పారవేసే దిక్కయినా లేరండీ మా పేటలో స్కూలు కుర్రాళ్ళం పూనుకుని అతన్ని సాగనంపుదా మని చందాలకి బయలుదేరాము."

అటుచూచాను అతని శవం రోడ్డు ప్రక్క దుమ్ములో...కప్పటానికి నిండా లేని చినిగిన పాతపీలికలు. అతని జీవితాని కక్కడ ఆఖరు. ఎ వ ర త ను ? ఎక్కడ ఎలా బ్రతికాడు ? ఈనాటి అతని అవస్థ ఏమిటి ? ప్రశ్నల పరంపర... ఎవరో ఆలపించిన "ఎవరి పిల్లలోయి మీరు !" గుర్తుకొచ్చింది

"బ్రిడ్జిక్రింద, స్టేషన్లో ధూళిమీద
ఎటుచూచిన మీ రూపులు ! ఎటు విన్నా
మీ అరుపులు !
....................... ....... ..
ఓ దిక్కుమాలిన తమ్ముల్లార !
నా ప్రాణమిత్రుల్లార !
ఈ లోకపు శాసనాలు
ఎంగిలాకు లిస్తాయి ! ఇనపకమ్మ
లిస్తాయి
న్యాయమూర్తి గ్రంధాల్లో నల్లని
అక్షరపు పంక్తులు
మీ మెడలకు ఉరివుచ్చులు.........
ఎవరి సంతతోయి మీరు........."

నాలోని మానవత్వాన్ని తిట్టి లేపిన శవానికి సహాయం చెయ్యాలని ఒక పది రూపాయల నోటు కుర్రవాడి పళ్ళెంలో పెట్టి, చుట్టూరావాళ్ళు నావైపు వెర్రిగా చూస్తూవుంటే, నేరస్థుడిలా తలవంచుకొని, అతని ఆత్మకు శాంతి కోరుతూ వెళ్ళిపోయాను ఆ దృశ్యమే కళ్ళల్లో మెదుల్తోంది. మనస్సుని మ ధి స్తోం ది అవును పాపం ! ఎవరి బిడ్డ ? ఎవరి బాధ్యత ? ఇలాంటివాళ్ళు, ఇంతకంటే ఘోర దృశ్యా లీ రామరాజ్యంలో రోజూ ఎన్నెన్ని ? కనీసం ఒక్కడి నయినా అవతలి వొడ్డుకు పంపగలిగి నందుకు సంతోషంగా వుంది.

అలా ఆలోచనలు సా గు తూ నే వు న్నా యి అం త వేడిగా ఉ న్నా మాగన్నుగా నిదుర పట్టింది......

పెద్ద సభావేదిక ఎ టు చూ చి నా ప్రజలు, ప్రజలు, అంతులేని ప్రజలు వేదికమీదనున్న నామెడ పూలమాలల బరువుకి వంగిపోతున్నది అప్పుడే ప్రతిష్టించిన నాకాంస్య విగ్రహం ఎత్తుగా నిల్చొని గర్వంగా చూస్తోంది. అధ్యక్షులు అనర్గళంగా మాట్లాడుతున్నారు "... చిన్నతనంలో కధల్లో కర్ణుడు, శిబిలవంటి ధర్మాత్ముల జీవితాలు చదువుకున్నాను అలాంటి వాళ్లసలు పుట్టివుంటారా అని అప్పటినుండీ నాకొకటే అనుమానంగా వుండేది. కాని ఇప్పుడులేదు కారణం, మనమధ్యలోనే అలాంటి వ్యక్తి ఒక రున్నారు ఆయనే వీ రు (నా వై పు చూపుతూ) వీరి చేతిలో ఎముక లేదు. లేదనేమాట ఆయన నోట ఏనాడూ పలికి

వుండరు..." మిగతాది కరతాళధ్వనుల్లో వినపడలేదు నాకు గాలిలో తేలిపోతున్న ట్లనిపించింది ఆనందంతో పిచ్చెక్కిన ట్లుంది మరో లోకంలో ఎగిరే నాకు చుట్టూరా ఏమీ కనిపించడంలేదు

చెవులు చిల్లులుపడే ఆ చప్పట్ల ధ్వని చీల్చుకొని నాకెక్కడనుండో విపరీత మయిన నవ్వు వినపడింది చుట్టూరా చూశాను ప్రజానీకం మధ్య, భూమిమీద కాళ్ళు తగలకుండానే అతను నిల్చొని కనపడ్డాడు ఎక్కడో పరిచయం అయిన మొగం సన్నగా, బద్దలా పొడుగ్గా వున్నాడు ఎముకలు ఎక్కడ వూడి రాలిపోతాయోనని చర్మంతో కప్పిన ట్లుంది ఎక్కడా కండరమే లేదు ఊడి పోయిన పళ్ళు, పొడుచుకొచ్చిన ముక్కు, పీక్కుపోయిన కళ్ళ గుంటల్లో గోళీల్లా జీవం లేకుండా వున్నాయి చొట్టలుపడిన దవడలు, గాలికి రెపరెపలాడే తెల్లని వెంట్రుకలు నెత్తిమీద వుందీ వుండన ట్లున్నాయి మేకుకు తగిలించిన చొక్కా లాగా చేతు లూగిపోతున్నాయి మొల చుట్టూ ఒకేఒక గుడ్డపీలిక

మరోసారి గట్టిగా నవ్వాడు నాశరీరం అంతా గగుర్పొడిచింది చుట్టూరా చూశాను మేమిద్దరంతప్ప సభలో ఎవరూ లేరు. కొంచెం భయంగావుంది ఎక్కడ చూశానా ఇతన్ని అని ఆలోచిస్తున్నాను

"ఏం గుర్తుపట్టలేదా ?" గుహలో నుండి మాట్లాడినట్లుంది



"అబ్బబ్బ, కాస్సేపు స్తిమితంగా ఉండవు కొ
నివ్వవు సరికదా, రోజుకొకసారయిన
నా పిలక ముడి సవరించనిదే నీకు తృప్తి
వుండదు "

"అయ్యో! ఇదెక్కడి ఖర్మమండీ! కొత్తిమీర
కట్టనుకొని ఎలుక లాగుతూవుంది"

"నీవు సత్యజిత్‌రాయ్ సినీమా లో అవ్వకు ఏమయినా అవుతావా ?"

"ఈ తెలుగువాళ్ళకున్న జబ్బే యిది ఎంత సేపూ పొరుగింటి కూర రుచి మీకు ఇంట్లోది ఏమీ పనికిరాదు "

"పోనీలే, పుల్లటికూర అన్నావుగాద రాయ్‌ని ఇంతరూ దగ్గరవాడి నంటావు, నాకుకూడా చాలవాగా జ్ఞాపకం వుంది నీ ముఖం "

"అయినా గుర్తుపట్టలేదా ?" బడి పంతులులాగా అడిగాడు.

"ఆలోచిస్తున్నాను .. ..వుండు, వుండు . ఆఁ అవును నీవు శ్రీశ్రీ కూతురు, అవ్వకి..."

"కరెక్ట్, ఆ అవ్వకు తోడబుట్టిన వాడిని నేను " గెల్చినవాడిలా పోజు పెట్టాడు,

"అవ్వ, మనుమరాలు బాగున్నారా?"

"ఎదురుగా వున్న నా సంగతి అడగవేం ?"

"మరే. మరచిపోయాను కులాసా? ఏమిటిలా వచ్చావు? చాలకాలం అయిన ట్లుంది మనం కలుసుకొని."

"అంతలోనే అంత మతిమరుపా! మొత్తానికి బడిపంతులు ననిపించావు పొద్దునేగా కలుసుకొంది"

"ఏమిటీ?"

"జ్ఞాపకం తెచ్చుకో పొద్దున నీవు కాలేజీకి వెళుతున్నావు..."

అవును నిజమే కోనేటిదగ్గర రోడ్డు ప్రక్కన...అదే పోలిక. పొద్దున నేను ధర్మంచేసింది ఇతని శవ సంస్కారానికే ఏ భూతమో అయినట్లున్నాడు భయంగా వుంది చెమటలు పడుతున్నాయి

"ఏం భూతాన్నని భయంగా వుందా?"

"మరి..." నా నోటినుండి మాటలు రావడంలేదు

"చనిపోయింది నా భౌతిక కాయం ఇప్పుడు నీవు చూచేది దగాపడిన నా ఆత్మ...పరీక్షలు అయిపోయినయ్యా?"

"ఆ, ఇక శలవులే"

"ఆరోగ్యంగా వున్నావా?"

"చెక్కుచెదరకుండా వున్నాను," అన్నాను ఎందుకడుగుతున్నాడో తెలీక

"ఎంతమందికి కాపీలు అందించావు?" అకస్మాత్తుగా చేసిన ఈ అభియోగానికి ఆశ్చర్యం, కోపం వచ్చినయి గట్టిగా కేకలేద్దామనుకున్నాను. అయినా నోరు పెగిలిందికాదు

"అంత అధోగతికింకా దిగజారలేదు"

"పోనీ ఎంతమంది కాపీ కొడుతుంటే చూస్తూ వూరుకున్నావు?" అసహ్యంగా వుంది సంభాషణ కాని అతన్ని చూస్తూ వుంటే సమాధానం చెప్పక తప్పలేదు

"ఏం చెయ్యమన్నావు?"

"ఏం, భయంపుట్టిందా?"

"నాకేం భయం" బుకాయించాను.

"కుర్రాళ్ళు తంతారని భయం పుట్టిందా?" రెట్టించాడు

ఒప్పుకోక తప్పిందిగాదు "అవును. మొన్న నొకాయన్ను పదిమందిలోనూ కొడితే ఎవరేం చెయ్యగలిగారు?" ఫిర్యాదు చేశాను

"నీతికీ, కర్తవ్యానికీ నిలబడేవాళ్ళు ఎడాలిమరి తప్పదు" సిద్ధాంతీకరించాడు అతను

"కాని. ..."

"పరువు పోతుందని, కర్తవ్యాన్ని మరిచిపోయి ఆత్మవంచన చేసుకున్నావు గదూ!"

నేనేవిషయాన్ని గురించి ఆలోచించ తలుచుకోలేదో దాన్నే ఇతను కుళ్ళగిస్తున్నాడు

"పలకవేం? నీ వాదం గూడా వింటాను, చెప్పు"

నన్ను నేను సమర్ధించుకోడానికి అవకాశం దొరికింది

"ఏం చెయ్యను మరి మరోసారి పరీక్షఫీజుకట్టే స్తోమత లేదంటూ డొకడు అయిదోసారి పరీక్షకి కూచుంటున్నానంటూ ప్రాధేయపడతాడు మరొకడు ఈ డిగ్రీ వస్తే ఉద్యోగం వస్తుంది, ప్రమోషను వస్తుంది, మీ దయ అంటారు మరొకళ్లు కాపీ కొట్టుంటే చూస్తూ వూరుకోలేను. అందుకని రిపోర్టు చేసి వాళ్ళని నాశనం చెయ్యనూలేను. నా ఈ దౌర్బల్యాన్ని వినియోగించుకున్నారు వాళ్ళు ''

"ఈ బాధ పడలేక, నాకెందుకని వరండాలో కుర్చీ వేసు క్కూర్చున్నా వన్నమాట ?'' గర్జించాడు అతను.

''ఏం చెయ్యను మరి, అంతకంటే?''

''చాతకానితనం ఉద్యోగానికి రాజీనామా ఇవ్వలేకపోయావా ?"

''మరి బ్రతుకుతెరువు ?''

''అయితే గాలిలో దీపంలా వుందన్న మాట నీ బ్రతుకు మొత్తానికి మీ ప్రభుత్వం అంత అనిశ్చయమయిన జీవితాన్ని కల్పించిందంటావు అంతేనా ?"

నాకు ఉద్యోగం యిప్పించిన మంత్రిగారు గుర్తుకొచ్చారు ప్రభుత్వం మీద అభిమానంకొద్దీ అనేశాను. "ప్రభుత్వాన్ని ఎందుకు ఆడిపోసుకుంటావు! ఎంత చేసిందో తెలుసా ప్రజలకు ''

''నాకు తెలీదే ? ఏదో కొంచెం చెప్పు. వింటాను.'' ఎగతాళిగా అన్నాడు.

"నేను చెప్పనక్కరలేదు ఆల్ ఇండియా రేడియో విను న్యూస్ రీళ్ళు, డాక్యుమెంటరీ ఫిల్ములు చూడు. పౌరసంబంధశాఖ నడుగు ఏ గోడమీద, ఎక్కడ చూచినా ప్రణాళికా ఫలితాలేనే!"

"సినీమాలకి, రేడియోలకి డబ్బులేదు నాదగ్గిర గోడలు వెతుక్కోను ఓపిక లేదు నీవే చెప్పు వింటాను '' ప్రతి మాటలోనూ నిరసన వినపడుతోంది. గట్టిగా వాదించా లనుకున్నాను.

"ఏం చెయ్యలేదు ? వ్యక్తి ఆదాయాన్ని పెంచుతూ, జాతీయాదాయాన్ని పెంచారు పెంచుతున్నారు పెంచుతారట గూడా దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నారు విద్య, ఆరోగ్యం, వసతులు కల్పిస్తున్నారు వెనుకబడ్డవారిని ముందుకు తోస్తున్నారు ప్రజాస్వామ్యం, సమానత్వం, సామ్యవాదం అంటూ ఎన్నెన్నో చేస్తుంటే..."

"ఎలక్షను ప్రచారానికి బాగా పనికొచ్చి వుంటావు ' నేనొక్కటి అడుగుతాను చెప్పు మరి నేనిలా బీదవాడిగానే వుండిపోయానేం ? నా అభివృద్ధిఅంతా దరిద్రంలోనే కనపడుతున్నదేం ?"

''ఎంత స్వార్థపరుడివి !" అవకాశం జారవిడుచుకోకుండా ఎదురుదెబ్బ కొట్టాను

"స్వార్థం కావచ్చు కాని నాలాంటి వాళ్లు కొన్ని కోట్లమంది వున్నారు. మరో విషయం మొన్న ఎన్నికల్లో

నిలబడి ఓటు అడగటాని కొక మంత్రి గారు వచ్చారు. ఆయన కారు మా మురికి పేటలోనికి రావడానికి దారిలేక దూరాన ఆపి నడిచి వచ్చారు పేటలోకి వచ్చి ఎంతో వినయంగా చేతులు జోడించి వోట్లు అడిగారు పాపం మురికి వాసన సహించలేక గావును మూడుసార్లు ముక్కు మీద గుడ్డ పెట్టుకోబోయి, మే మేమను కుంటామో ననో ఏమో మానేశారు వెళ్ళిపోయింతర్వాత ఎన్నితిట్టుకున్నారో ఏమో ? రేపు అయన చచ్చిపోతే నాలాగానే రోడ్డు ప్రక్కన చస్తాడా ? ఆయన శవ సంస్కారానికిగూడా నీలాంటివాళ్లు చందాలు వెయ్యవలసిందేనా '"

ఇంత నీచంగా మాట్లాడుతున్నందుకు నా కపరిమితంగా కోపం వచ్చింది అసహనంతో ఆలోచించకుండా అనేశాను "కొంచెం వెనకాముందూ ఆలోచించి మాట్లాడు ఆయనకేం ఖర్మం, నీ లా దిక్కుమాలిన చావు చావడానికి. జయ జయ ధ్వానాలు చేసుకుంటూ మోసు కెళ్తారు మహారాజులా మంచిగంధపు చెక్కలతో దహనం చేస్తారు "

"అవునవును శవాన్ని తీసుకెళ్ళే టప్పుడు త్రోవ పొడుగునా డబ్బులు గూడా వెదజల్లుతారు ' సమానత్వం గదూ అన్నావు సామ్యవాదం గూడానా ? అహ్హహ్హ " పెద్దగా వికటాట్టహాసం చేశాడు ఆనవ్వు గుండెల్లో కెలికేస్తున్నది వెన్నులో మరమేకులు తిప్పినట్లయింది విపరీతంగా భయపడిపోయాను మొఖం రెండు చేతుల్తోనూ కప్పుకొని బాధని తప్పించుకోవాలని ప్రయత్నం చేస్తున్నాను అంతలో అందుకున్నాడు మళ్ళా అతను

"ఏం, నిజం అంత కఠోరంగా వుందా ? అంతగా భయపడిపోయావు. సత్యాన్ని ఎదుర్కొనే సాహసం లేదు నీకు, పిరికిపందా ' ఇంక విద్యార్థుల కేం పాఠాలు చెబుతావు ? వాళ్ళనేం పనికొచ్చే లాగా చేస్తావు ఛీ, ఛీ నిన్ను చూస్తుంటేనే నా కసహ్యంగా వుంది నిజాన్ని మరచిపోయి, అవకాశవాదిగా నీలాంటి బూటకపు బ్రతుకు బ్రతికేవాళ్ళని ఏం చేసినా పాపం లేదు ''

అతనివంక చూడలేక పోతున్నాను. కళ్ళు నిప్పులు కురిపిస్తూ మీదకు దూకేట్లున్నాడు నా కింతవరకూ ఉన్నధైర్యం కాస్తా పోయింది ఎదిరించి మాట్లాడ డానికి అవగింజంత వోపికలేదు ఇతని బారినుండి తప్పించుకోడానికి బ్రతిమాలడం ఒక్కటేమార్గంగా కనపడింది

"నామీద ఎందుకు నీకింతకోపం నేను నీకేం అపకారం చేశానని ఇలా బాధపెట్తావు నన్ను ? తోటిమానవుడిని హింసించడమే నీకు సరదాగా వుందా ! రోడ్డుపక్క నీశవం దుమ్ముకొట్టుకు పోయి, కుక్కల పాలవకుండా నేను కాపాడానే ' నిన్ను శాస్త్రయుక్తంగా,



"వీ డెవడే, యేకంగా యింట్లోకే వచ్చేశాడు!"
"అబ్బే ' యెవరో అయితే ఎందుకు రానిస్తాను. ఈ మధ్య మీ ఖర్చులు మరీ యెక్కువై పోయాయని ఖర్చుపద్దులు రాసేందుకు గుమాస్తాగా పెట్టాను "

సాంప్రదాయబద్ధం గా ఊర్ధ్వలోకాలకి పంపి అవతలదరి చేర్చడానికి తోడ్పడ్డాను. చనిపోయిన నీకెంత సహాయపడ్డాను. బ్రతికివున్నప్పుడే కలిస్తే ఇంకెంత చేసేవాడినో! నీ అంతిమ యాత్రలో అవమానం పాలు కాగూడదనేగా నేను సహాయం చేసింది ఆ చేసిన మేలుకా ఈ చిత్రవధ ?"

అలా కాళ్ళావేళ్ళా పడినందుకు కొంచెం మెత్తపడినట్లున్నాడు నాకు కాస్త ధైర్యం వచ్చింది. అంతలో అతను అందుకున్నాడు "నిజమే ఒప్పుకుంటాను నా శవాన్ని తగలవెయ్యటానికి సహాయ పడ్డావు కాదనను కాని నీవు సహాయంచేసింది ఆ దృశ్యాన్ని చూడలేక గదూ ? నా శవం కుళ్ళితే మీకందరికీ రోగాలొస్తాయనేగా ' మీ అడ్డం తొలగించుకోవాలనేగా ''"


"కాదు, కాదు సానుభూతితోనే ఆ కుర్రాడు చెప్పాడు, నీవెంతో మర్యాదగా బ్రతికావనీ, పదిమందికీ సహాయం చేసేవాడివనీను అందుకని జాలి కలిగింది."

"ఏమిటంటున్నావు ? నామీద జాలి కలిగిందా ' నే బ్రతికున్నన్నాళ్ళూ ఒక్కడూ అనలేదీమాట మొట్టమొదటి సారిగా నీ నోటివెంట వింటూంటే నాకాశ్చర్యంగా వుందివ్వాళ నీతికీ నిజాయితీకీ నిలబడిన నాకు చివరికేంగతి పట్టిందో చూడుమరి . '' అతని కళ్ళల్లో ఎక్కడో ఒక నీటిచుక్క కదిలినట్లయింది కొంచెం మెత్తబడినట్లున్నాడు ధైర్యం తెచ్చుకొని అడిగాను అసలేం జరిగిందని

"ఉద్యోగంమాని, రావుబహదూర్ వద్దని, స్వరాజ్యంకోసం జైలుకెళ్లాను ఆనాడు బయటకొచ్చేసరికి కుటుంబం అంతా నాశనమయింది రాజకీయ బాధితుడిగా మన ప్రభుత్వం యిస్తానన్న పొలం, నష్టపరిహారం నా కక్కరలేదని నిరాకరించాను అవినీతి ఉన్నచోటల్లా ఎదురుతిరిగి పోరాడాను తిరుగుబాటుదారునని నేరారోపణ చేశారు కాదు మానవతావాదిని, వాస్తవాన్ని చూస్తాను అని గొంతు చాచుకు అరిచాను ఎవరూ వినలేదు కాని నేను చెయ్యగల సహాయం ఎవ్వరికయినా సరే చేశాను అయినా నన్నంతా దూరంగా నెట్టారు. ఫలితం రోడ్డుప్రక్క దిక్కుమాలిన చావు " నిట్టూర్చాడు, పాపం

''చూశావామరి ! అలాంటి నీకు ఆఖరికి సహాయం చేశాను నేను." కొంచెం గర్వంగానే అన్నాను. తప్పు చేశానని వెంటనే తెలిసింది. ఏదో నేను గుర్తుచేసినట్లుగా అతను మరోసారి రౌద్రాకారం దాల్చాడు. నమిలి మింగి వేద్దామా అన్నట్లు చూస్తో అన్నాడు. ''సహాయం చేశావు నిజమే. కాని నీకా డబ్బు ఎక్కడనుండి వచ్చింది? ఎలా సంపాదించావు? నీతిగా సంపాదించావా? చెప్పు. అబద్ధమాడావో నీతల తీసివెయ్య గలను.'' హుంకరించాడు. నా నవనా డులూ క్రుంగి పోతున్నాయి. ఈ మధ్య ఏ విషయంగురించి నేను మధనపడి పోతున్నానో దానినే ఇతను గుచ్చి అడుగుతున్నాడు. మరచిపోదామంటే మరీ, మరీ గుర్తుకొస్తున్నది.

పరీక్షలు ఇంకా రెండు రోజుల్లో మొదలెడతారనగా జరిగిన సంఘటన. ఆవేళ సాయంత్రం ఇంటిదగ్గర ఏదో వ్రాసుకుంటూ కూర్చున్నాను. ఇంటి ముందు కారాగిన చప్పుడయి చూశాను. దిగివస్తున్న అతన్ని ఇంతకుముం దెన్నడూ చూడలేదు. ఒడ్డూ పొడుగూ దిట్టంగా వున్నాడు. లక్ష్మీపుత్రుడని కన పడుతూనే వుంది. కాని శరీరం ప్రతి కదలికలోనూ ఏదో అసంతృప్తి కనపడు తున్నది. 'నమస్కారం, మాష్టారూ' అంటూ తనని తను పరిచయం చేసు కున్నాడు. ఏదో జమీందారీ వంశం. ఐశ్వర్యానికంతులేదు. ఎలక్ట్రిక్ పంకాల కంపెనీ ఏదో వుందన్నాడు. బి. ఏ. పరీ క్షకు కూచుంటానని, నా సహాయం కావాలని అడిగాడు. వ్యవధి లేనందువల్ల నేనేం పాఠాలు చెప్పలేనన్నాను. పాఠాలు చెప్పనక్కరలేదని పరీక్షల్లో సహాయం చెయ్యమని అడిగితే చెడా మడా మొఖం వాసేట్లు పదిపెట్టాను. అప్పుడు ఎంతో దీనంగా ప్రాధేయ పడ్డాడు. ఎంత శ్రద్ధతో చదివినా పరీక్ష ప్యాసవలేక పోతున్నానని, కనీసం బి.ఏ. అయినా లేనందుకు తనవాళ్ళందరిమధ్యా చిన్నతనంగా వుందని, అన్నీవుండీ ఏమీలేనివానిలా బాధపడుతున్నానని ఎంతో జాలిగా మాట్లాడాడు. నే నేమీ అతనికి ప్రత్యేకంగా చెయ్యనక్కర లేదనీ పరీక్షహాల్లో కొంచెం చూసీ చూడ నట్లుండమని కోరాడు. నా హాలులోనే కూర్చుంటావని నమ్మకం ఏమిటి—అని తప్పించుకో జూచాను. అది తను చూచుకుంటానన్నాడు. నాతో వుండే రెండో సూపర్‌వైజర్ ఎందుకూరు కుంటాడు—అని వంక పెట్టబోయాను. అదీ తను చూచుకుంటానన్నాడు. మాట్లాడుతున్నంతసేపు టేబుల్ మీద గుడ్డని కదుపుతూనే వున్నాడు. నాకతని మీద జాలి కలిగినమాట వాస్తవమే. అయినా ఏం చెయ్యాలో తోచక తల చేతుల్లో పెట్టుకు కూర్చున్నాను ఆలో చిస్తో. అలా ఎంతసేపు కూర్చున్నానో



"ప్రేయసీ ! నీకోసం ఏమి చెయ్యమన్నా చేస్తా."
"అట్లాగైతే నావెంట పడటం మానేసి, ఆ వెనకొచ్చే అమ్మాయి వెంట పడు "

తెలీదు. తల పైకెత్తిచూస్తే లేదు. పరీక్ష లయింతర్వాత కనపడతానని చెప్పి వెళ్ళాడన్నారు ఇంట్లో. తర్వాత పరీక్షల్లో అతను కాపీకొట్టుతున్నట్లు చూచినా పట్టుకొని రిపోర్టు చెయ్యలేక పోయాను. నేను తలవంచుకు కూర్చుంటే తన పనేదో చేసుకుపోయాడు. ఆగ్లాని ఆత్మని పట్టుకొనేవుంది ఇంకా

"ఏం మాట్లాడవేం ?" అన్న ఉరుముకు ఉలిక్కిపడ్డాను. ఎదురుగావున్న ఆకారాన్ని, ఆలోచనల్లోపడి మరచిపోయాను. కోపంతో అతను ఊగిపోతున్నాడు. అసహ్యంతోనూ, కోపంతోనూ మరీ భయంకరంగా వుంది అతని ముఖం. మరోసారి గర్జించాడు —

"ఎవరికీ చెప్పకుండావుంటే అదే పోతుందనుకున్నావు గదూ ? ఆ కుర్రాడు నీ టేబుల్‌క్లాత్ కిందపెట్టిన రెండువందల నోట్లు నే నెరగననుకున్నావా ! ఆ పాపిష్టి డబ్బులోదేగా నా శవ దహనాని కిచ్చిన చందా. ఛీ, ఛీ. నిన్ను ఏం చెయ్యను ? నేను ఎన్ని కష్టా లనుభవిస్తూ బ్రతికినా నీతీ, నిజాయితీతో బ్రతికానన్న సంతృప్తి వుండేది చచ్చేంతవరకూ. అందుకనే సంతోషంగా వున్నాను. మరణంలో నన్ను మైలపరిచావు నీవు. నా ఆత్మలో నిప్పులు చల్లావు. అంతవరకూ ఆత్మ బలంతోనూ, గర్వంతోనూ బ్రతికిన నన్ను అధఃపతితుడిని చేశావు చివరకు. ఇంక నా ఆత్మకు శాంతిలేదు. తీరని వ్యధని

కల్పించావు. నీవు చేసిన అన్యాయానికి నిన్నేం చేసినా పాపం లేదు. నీలోకంలో న్యాయస్థానాలకు నేను వెళ్ళను నాకు తెలుసు నీ మంత్రులు నిన్ను రక్షిస్తారని. అందుకే నీ ఆత్మ న్యాయస్థానంలో నా ఫిర్యాదు. అవినీతికి తలవంచి, చాపులో నన్ను అవమానించిన నీకు ఏమి శిక్ష కావాలో కోరుకో, అనుభవించు."

"క్షమించాలి. తీరని నేరం చేశాను మీ పాదాలు పట్టుకుంటాను మీకుతోచిన శిక్ష విధించండి. ఆనందంతో అనుభ విస్తాను." భయంతో, సిగ్గుతో నోటి వెంట మాట రాకపోయినా, ఏదో నసిగాను

"నా జీవితంలో నే నెవరినీ శిక్షించ లేదు ఈ నాడు ఆఫీని, చచ్చి సాధించను నే చెప్పతలిచిందేదో చెప్పాను నీ యిష్టం వచ్చినట్లు కానీయి ఇక నే వెళ్తాను"

"వెళ్ళకండి నన్నిలా అసహా యునిగా చేసి వదలి వెళ్ళకండి" అని అరుస్తూ ఆయనవైపుకు పరుగెత్త బోయాను వేదికమీదనుండి ఒక్కసారి క్రిందపడినట్లయింది.

మెలకువవచ్చి చూచాను. గడగడ వణికిపోతున్నాను. అంతసేపూ నిద్రలో క్రూర నరకం అనుభవించినట్లుంది. అయినా ఇప్పుడు నా పాపం కళ్ళకి కట్టిన ట్లున్నది. జరిగిందానికి ఏం చెయ్యను? ఇక ముందు జాగ్రత్తపడతాను అతని అడుగుజాడల్లో నడవాలని నిర్ణయించు కొన్నాను అలా ఆలోచిస్తూ ముందు గదిలోకి వచ్చాను. ఎదురుగా టేబుల్ మీద ఒక కొత్త ఎలక్ట్రిక్ పంకా వుంది 'మాష్టారికి, కృతజ్ఞతతో' — అని దానికి కాయితం వ్రేళ్ళాడుతోంది. నిద్దరపోతు న్నప్పుడా జమీందా రబ్బాయి వచ్చాడనీ, నిద్ర లేపవద్దని అది అక్కడపెట్టి వెళ్ళా డని ఇంట్లో చెప్పారు. నా పాపాన్ని జ్ఞాపకం చేస్తూ వుండడాని కొక వస్తువు వదలి వెళ్ళాడన్నమాట. మంచి దే ఎప్పుడూ ఎదురుగా కనిపించే శిక్ష. ఇక ముందు జీవితంలో నా కిదే మార్గదర్శి కావాలి అందుకనే అట్టముక్క కట్టి దాని మీద వ్రాశాను — "అవినీతికి ఆనవాలు" — అని.

★

